
సాక్షి
పల్నాడు

మంగళవారం । 28 । జనవరి । 2025



ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్

విజయపురిసౌత్: రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన నాగార్జునసాగర్ పోలీస్ చెక్‌పోస్ట్ వద్ద ఆటో డ్రైవర్లకు సోమవారం ఎస్‌ఐ షేక్ మహమ్మద్ షఫీ కౌన్సెలింగ్ నిర్వహించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 554.70 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 4,709 క్యూసెక్కులు వదిలారు.

సబ్ రిజిస్ట్రార్‌కు ఉత్తమ సేవా పురస్కారం



నరసరావుపేట టౌన్: గణతంత్ర దినోత్సవం సందర్భంగా జాయింట్ సబ్ రిజిస్ట్రార్–2 పీవీ నాగేశ్వరరావు ఆదివారం కలెక్టర్ అరుణ్ బాబు చేతుల మీదుగా ఉత్తమ సేవా అవార్డు అందుకున్నారు.

న్యూస్‌రీల్

మార్చి 8న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేటటౌన్: జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని 13వ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ సోమవారం తెలిపారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చి 8న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. సివిల్ కేసులను లోక్ అదాలత్‌లో రాజీ చేసుకున్నట్టయితే కోర్టు ఫీజు వాపసు ఇవ్వనున్నట్లు వెల్లడించారు.

జాతీయ స్విమ్మింగ్ పోటీలకు సాంకేతిక అధికారిగా సురేష్



నరసరావుపేట ఈస్ట్: జాతీయస్థాయి స్విమ్మింగ్ (ఈత) పోటీలకు పట్టణానికి చెందిన ఈత కోచ్ జి.సురేష్ సాంకేతిక అధికారిగా నియమితులయ్యారు. ఉత్తరాఖండ్‌లో ఈనెల 29 నుంచి ఫిబ్రవరి 5 వరకు జరగనున్న 38వ జాతీయ క్రీడల్లో భాగంగా నిర్వహించనున్న స్విమ్మింగ్ పోటీలకు సురేష్‌ను సాంకేతిక అధికారిగా నియమిస్తూ భారత స్విమ్మింగ్ ఫెడరేషన్ ఉత్తర్వులు జారీ చేసింది. ఈమేరకు ఆంధ్రప్రదేశ్ స్విమ్మింగ్ అసోసియేషన్ కార్యదర్శి ఎ.మోహనవెంకటరామ్ సురేష్‌కు ఉత్తర్వులను అందచేశారు. కేంద్ర యువజన సర్వీసులు, క్రీడల మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 14వ తేదీ వరకు ఉత్తరాఖండ్‌లో వివిధ క్రీడాంశాలలో పోటీలు జరగనున్నాయి.

నేడు జాబ్ మేళా

నరసరావుపేట ఈస్ట్: జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయ సమీపంలోని ఎన్‌ఏసీ ట్రైనింగ్ సెంటర్‌లో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఇ.తమ్మాజీరావు సోమవారం తెలిపారు. జాబ్ మేళాకు కోర్ ఇంటిగ్రా, ఐసీఐసీఐ బ్యాంక్, ఎస్‌బీఐ కార్డ్స్, ఫాక్స్ కాన్, డిమార్ట్, యూనిటీ మోటార్‌వర్క్ వంటి సంస్థలు హాజరవుతాయని వివరించారు. జాబ్ మేళాకు ఇంటర్మీడియెట్, డిగ్రీ, ఐటీఐ, బీటెక్, ఫార్మసీ, పీజీ విద్యార్హతలు కలిగి 18 నుంచి 35 సంవత్సరాలు వయస్సు గల నిరుద్యోగ యువకులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, బయోడేటాతో నేరుగా హాజరు కావచ్చని తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు ఇంటర్వ్యూలు నిర్వహించి ఉద్యోగాలకు ఎంపిక చేస్తారని తెలిపారు. వివరాలకు వీరాంజనేయులు 9160200652, వై.శ్రీనివాసరెడ్డి 9908482907 నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రావిపాడులో పోలీసుల మోహరింపు



నరసరావుపేట రూరల్: రావిపాడులో సోమవారం పోలీసులు మోహరించారు. చీరాల వాడరేవు–నకరికల్లు రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ఏర్పాటు చేయనున్న బైపాస్ రోడ్డుకు భూములు ఇచ్చేందుకు రైతులు వ్యతిరేకిస్తున్నారు. జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో సోమవారం బైపాస్‌రోడ్డుకు మార్కింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించారు. రైతుల వ్యతిరేకత దృష్ట్యా పోలీసులను పెద్ద ఎత్తున మోహరించారు. డివిజన్‌లోని పోలీసు సిబ్బందిని బందోబస్తు విధుల్లో నియమించారు. ఉదయానికే గ్రామ సచివాలయం వద్దకు అధికసంఖ్యలో పోలీసులు చేరుకున్నారు. రెవెన్యూ అధికారులు సర్వే సిబ్బందితో గ్రామ సచివాలయం వద్దకు వచ్చారు. హైవే అథారిటీకి చెందిన సర్వే సిబ్బంది రాకపోవడంతో మధ్యాహ్నం వరకు ఎదురుచూసిన పోలీసు, రెవెన్యూ సిబ్బంది వెనుతిరిగారు. మరోసారి జిల్లా అధికారుల నుంచి ఆదేశాలు వచ్చిన తరువాత మార్కింగ్ పనులు చేపట్టనున్నారు.

నేడు సత్రశాల దేవస్థానంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై సమీక్ష

రెంటచింతల: సత్రశాల వద్ద ఉన్న పురాతన గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవస్థానంలో మహాశివరాత్రి ఏర్పాట్లపై మంగళవారం వివిధ శాఖాధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఈఓ గాదె రామిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి హాజరవుతారని వివరించారు. ఫిబ్రవరి 25 నుంచి 27 వరకు చేపట్టాల్సిన పనులపై ఈ సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్న ఈ సమావేశంలో వివిధ శాఖల మండల స్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని ఆయన కోరారు.

చెమిర్చిన కన్నులు

- మిరప కాపు సరిగా లేదని రైతుల లబోదిబో
- నకిలీ విత్తనాలతో నట్టేట మునిగామని ఆవేదన
- రూ.లక్షల పెట్టుబడులు నష్టపోయామని ఆక్రందన



రేమిడిచర్ల గ్రామంలో సాగు చేసిన మిరప పంట



రైతులు కొనుగోలు చేసిన విత్తన ప్యాకెట్లు

బొల్లాపల్లి: నకిలీ విత్తనాలతో నట్టేట మునిగామని, కష్టమంతా నేలపాలైందని రేమిడిచర్లకు చెందిన మిరప రైతులు ఆవేదన చెందుతున్నారు. కాపు రాక ఘొల్లుమంటున్నారు. ఈ గ్రామానికి చెందిన 20 మంది రైతులు 80 ఎకరాల్లో మిరప సాగు చేశారు. కారంపూడికి చెందిన పి.శివకృష్ణ శ్రీకర్షక్ సీడ్స్ షాపులో బాడిగరకం మిరప విత్తనాలను కొని సాగు చేశారు. దుకాణదారు దిగుబడి బాగా వస్తుందని చెప్పడంతో 10 గ్రాముల ప్యాకెట్ ధర రూ.450 వంతున ఎకరాకు 10 నుంచి 15 ప్యాకెట్ల విత్తనాలు కొని సాగు చేశారు. సాగుకు రూ.లక్షల్లో పెట్టుబడులు పెట్టారు. ఇప్పుడు కాపు సరిగా రాలేదు. మొక్క ఏపుగా పెరిగినా కాయలు అంతగా కాయలేదు. దిగుబడి భారీగా తగ్గుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. కాసిన కాయ కూడా పొడవుగా ఉందని, ఇప్పటివరకు ఇలాంటి రకం మిరప విత్తనాలు సాగు చేపట్టలేదని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎకరాకు 20 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉన్నా.. 5 నుంచి 10 క్వింటాళ్లు వచ్చే పరిస్థితి కనిపించడం లేదని కన్నీరుమున్నీరవుతున్నారు. నకిలీ విత్తనాలను అమ్మిన వ్యాపారిపై చర్యలు తీసుకోవాలని, నష్టపోయిన వారిని ఆదుకోవాలని చెమర్చిన కన్నులతో వేడుకుంటున్నారు.

నిలువునా మోసపోయా



కర్షక్ సీడ్స్ మేలు రకం మిరప విత్తనాలు అని చెప్పి అంటగట్టారు. 6 ఎకరాల్లో సాగుచేశా. ఇప్పటికే రూ.3లక్షలు పెట్టుబడులు పెట్టా. కాపు సరిగా లేదు. దిగుబడి సరిగా రాదని అర్థమైపోయింది. నిలువునా మోసపోయా. ప్రభుత్వం ఆదుకుని న్యాయం చేయాలి.

– వై.దశరథ్, రైతు, రేమిడిచర్ల

పది క్వింటాళ్ల దిగుబడి వచ్చే పరిస్థితి లేదు



రెండు ఎకరాల్లో సాగు చేశా. రూ.లక్షకుపైగా పెట్టుబడి పెట్టా. బాడిగరకం విత్తనాలని అధిక దిగుబడులు వస్తాయని చెప్పారు. ఇప్పుడు 10 క్వింటాళ్లు వచ్చే పరిస్థితి లేదు. మొక్క ఏపుగా పెరిగినా కాపు సరిగా లేదు. ఈ రకం మిరప కాయల విక్రయాలు జరిగే పరిస్థితి కూడా కానరావడం లేదు. ప్రభుత్వం న్యాయం చేయాలి.

– గోపిరెడ్డి రమణారెడ్డి, రైతు, రేమిడిచర్ల

విత్తన ఎంపికలో లోపం

రైతులు నకిలీ విత్తనాలు కొన్నామని ఫిర్యాదు చేశారు. క్షేత్రస్థాయిలో మిరప పంట పొలాలను పరిశీలించాం. విత్తన ఎంపికలో లోపం ఉన్నట్లు గమనించాం. ఈ విషయాన్ని లాం ఫాం సైంటిస్ట్‌ల దృష్టికి తీసుకెళ్లాం. వారు సందర్శించి పరిశీలించిన అనంతరం నిర్ధారించాల్సిన ఉంది.

– షేక్ నబీ రసూల్, ఉద్యాన వన శాఖ అధికారి, వినుకొండ

కలెక్టర్‌కు మహిళా రైతు ఫిర్యాదు



నరసరావుపేట: నకిలీ మిరప విత్తనాల వల్ల మోసపోయానని బొల్లాపల్లి మండలం గండిగనుముల గ్రామానికి చెందిన మహిళా రైతు నేనావతు దేవీభాయి ప్రజా సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. కలెక్టరేట్‌లో జరిగిన ప్రజాసమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఆమె తన గోడును వెళ్లబుచ్చారు. ఆమెతోపాటు దేశభక్త ప్రజాతంత్ర ఉద్యమం(పీడీఎం) జిల్లా కార్యదర్శి జి.రామకృష్ణ విలేకరులతో మాట్లాడారు. వారి కథనం ప్రకారం.. నేనావతు దేవీభాయి తనకున్న 1.50 ఎకరాలలో మిరప పంట సాగు నిమిత్తం కారంపూడిలోని తిరుమల సీడ్స్ షాపు యజమాని నాగేశ్వరరావు వద్దకు వెళ్లారు. రామ్ తేజ్ 999 రకం మిరప విత్తనాలు కొనుగోలు చేశారు. ఈ రకం అధిక దిగుబడినిస్తుందని యజమాని నమ్మబలికారు. అయితే ఇప్పుడు మొక్క ఎదుగూబొదుగూ లేదు. కాపు, పూత లేక నష్టపోయినట్టు మహిళా రైతు గుర్తించారు. వెంటనే షాపు యజమాని వద్దకు వెళ్లి నిలదీశారు. అయితే షాపు యజమాని దిక్కున్నచోట చెప్పుకోవాలని దౌర్జన్యం చేశారు. దీంతో మహిళా రైతు కలెక్టరేట్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన కలెక్టర్ విత్తనాల వ్యాపారిపై వెంటనే కేసు నమోదు చేయాలని అధికారులను ఆదేశించినట్టు రామకృష్ణ వెల్లడించారు. కార్యక్రమంలో పీడీఎం సీనియర్ నాయకులు వై.వెంకటేశ్వరరావు, నల్లపాటి రామారావు, జిల్లా అధ్యక్షులు షేక్.మస్తాన్‌వలి, బాధిత మహిళా రైతు నేనావత్ దేవీభాయి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

సర్వేలు రెండు రోజుల్లో పూర్తిచేయండి

ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించిన కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: గ్రామ, వార్డు సచివాలయాల సిబ్బంది క్షేత్రస్థాయిలో నిర్వహించే సర్వేలను రెండురోజుల్లోగా పెండింగ్ లేకుండా పూర్తి చేయించాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు.

సోమవారం కలెక్టరేట్‌లో గ్రామ, వార్డు సచివాలయాల సేవలపై సమావేశం నిర్వహించారు. జియో ట్యాగింగ్, ఎన్పీసీఐ, పీఏసీఎస్ లబ్ధిదారులు, నాన్ రెసిడెంట్ ఏపీ సిటిజెన్స్, సామూహిక ఆస్తులు, ఎమ్మెస్ఎంఈ వంటి సర్వేలను వెంటనే పూర్తి చేయాలన్నారు. రేపట్లోగా జిల్లాలో దాదాపు రూ.20 వేల మంది శిశువుల ఆధార్ వివరాలను పోషన్ ట్రాకర్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. మిగిలిన 30 వేల మంది శిశువులకు క్యాంపు ద్వారా ఆధార్ అందించాలన్నారు. నూతన ఇసుక విధానం ప్రకారం ట్రాక్టర్ల ద్వారా జరుగుతున్న ఇసుక రవాణా వివరాలను నమోదు చేయాలన్నారు. ఫిబ్రవరి 10 నాటికి జిల్లాలోని సంపద సృష్టి కేంద్రాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలన్నారు. జిల్లాలో నిర్మాణం పూర్తయిన ఇళ్లకు ఆలస్యం చేయకుండా బిల్లులు చెల్లించాలని సూచించారు. ఇప్పటికే లబ్ధిదారులు నివాసం ఉంటున్న ఇళ్ల వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు పాల్గొన్నారు.

ప్రతి ఫిర్యాదూ పరిష్కారం కావాలి

కలెక్టర్ అరుణ్‌బాబు



కలెక్టర్ కార్యాలయంలో ప్రజల సమస్యలు వింటున్న కలెక్టర్, జాయింట్ కలెక్టర్

నరసరావుపేట: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చే ప్రతి ఫిర్యాదూ పరిష్కారం కావాలని కలెక్టర్ పి.అరుణ్‌బాబు జిల్లా అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు జిల్లాలోని నలుమూలల నుంచి హాజరైన ప్రజలు 32 వినతులను అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో నలుమూలల నుంచి అర్జీదారులు ఇక్కడికి వస్తుంటారని పేర్కొన్నారు. అటువంటి వారి సమస్యలను సావధానంగా విని సత్వర పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఉద్బోధించారు. జాయింట్ కలెక్టర్ సూరజ్ గనోరే, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.మధులత పాల్గొన్నారు.

బస్‌షెల్టర్ ఏర్పాటు చేయండి

కాకాని గ్రామ సమీపంలో బస్ షెల్టర్ లేక జేఎన్‌టీయూ కళాశాల విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ముఖ్యంగా విద్యార్థినులు బస్సుల కోసం గంటల తరబడి వేచి ఉండలేక అవస్థలు పడుతున్నారు. వెంటనే బస్ షెల్టర్ ఏర్పాటు చేయండి.



– ఎం.నాగేశ్వరరావు, షేక్.యాసిన్, జి.జగదీష్, ఏఐఎస్ఎఫ్ నాయకులు

ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ చేయండి



రొంపిచర్ల మండలం మాచవరం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను ఉన్నతపాఠశాలగా అప్‌గ్రేడ్ చేయాలి. ప్రస్తుతం పాఠశాలలో ఒకటి నుంచి ఎనిమిది వరకు 100 మంది విద్యార్థులు చదువుతున్నారు. మరో 300 మంది విద్యార్థులు మా పాఠశాలలో 9, 10 తరగతులు లేకపోవటం వల్ల నరసరావుపేట, రొంపిచర్లలోని ప్రైవేటు పాఠశాలలకు వెళ్తున్నారు. పాఠశాలను హైస్కూలుగా అప్‌గ్రేడ్ చేయాలి.

– అబ్రహాం, పేరెంట్స్ కమిటీ చైర్మన్, అంజిరెడ్డి, కృష్ణారెడ్డి, ఆంజనేయులు, ఫిరోజ్, గ్రామస్తులు

పట్టాదారు పాస్ పుస్తకం మంజూరు చేయండి



నా తండ్రి నాగయ్యకు ములకలూరులో 1979లో ప్రభుత్వం 82సెంట్ల భూమికి డీకే పట్టా ఇచ్చింది. దీనికి ఆన్‌లైన్‌చేసి పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని అర్జీ పెట్టాం. ఆ భూమి వేరేవారి పేరుపై ఆన్‌లైన్‌లో నమోదైంది. వీఆర్వో విచారణ చేసి భూమి మా స్వాధీనంలో ఉందని నివేదిక ఇచ్చారు. వెంటనే పాస్‌పుస్తకం మంజూరు చేయాలి.

– చింతిరాల మీరయ్యమాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకుడు

రాత్రి 10 గంటలకు టెలీ కాన్ఫరెన్స్

పల్నాడు డీఈఓ వైఖరితో హెచ్‌ఎంల అసహనం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉన్నత పాఠశాలల్లో విలీనం చేసిన 3,4,5 తరగతులను తిరిగి ప్రాథమిక పాఠశాలల్లో కలిపేందుకు ఉద్దేశించిన ప్రక్రియపై విద్యాశాఖాధికారులు చేస్తున్న హడావుడి ఉపాధ్యాయుల సహనాన్ని పరీక్షిస్తోంది. ప్రభుత్వ ఉత్తర్వుల అమలు పేరుతో వేళాపాళా లేని సమావేశాలతో ఉపాధ్యాయులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పల్నాడు డీఈవో చంద్రకళ సోమవారం రాత్రి 10 గంటల సమయంలోనూ జిల్లాలోని వివిధ మండలాల ఎంఈవోలు, హెచ్‌ఎంలతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించడం విమర్శలకు తావిస్తోంది. పగటిపూట నిర్వహించాల్సిన సమావేశాన్ని రాత్రి 8.30 నుంచి ప్రారంభించిన డీఈవో 10 గంటల సమయానికి కంటిన్యూ చేయడంతో ఎంఈవోలు, హెచ్‌ఎంలు తలలు పట్టుకున్నారు. పల్నాడు జిల్లాలోని వివిధ మండలాల్లో పనిచేస్తూ గుంటూరులో నివసిస్తున్న హెచ్‌ఎంలు ఉదయాన్నే పాఠశాలలకు వెళ్లాల్సి ఉండగా, డీఈవో వైఖరితో విసుగు చెందుతున్నట్లు వాపోతున్నారు. నిద్రకు ఉపక్రమించాల్సిన సమయంలో టెలీ కాన్ఫరెన్స్‌లు నిర్వహించి, ఆగమేఘాలపై తేల్చాల్సిన విషయం కాదు కదా అని పెదవి విరుస్తున్నారు.

నలుగురు పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు

నరసరావుపేట: గణతంత్ర దినోత్సవం నాడు నూజెండ్ల మండలంలోని పలు గ్రామ సచివాలయాలలో జాతీయ పతాక ఆవిష్కరణ చేయలేదనే వార్తలను కలెక్టర్ పి.అరుణ్‌బాబు తీవ్రంగా పరిగణించారు. నలుగురు పంచాయతీ కార్యదర్శులకు వెంటనే షోకాజ్ నోటీసులు జారీ చేయాలని డీపీఓ భాస్కర్‌రెడ్డిని ఆదేశించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నూజెండ్ల, చింతల చెరువు, ఐనవోలు, ముప్పరాజుపాలెం గ్రామం సచివాలయాల పంచాయతీ కార్యదర్శులకు డీపీఓ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 48గంటల్లోగా వివరణ ఇవ్వాలని ఆదేశించారు.

సాగర్ జలాలను వృథా చేయొద్దు

మంత్రి గొట్టిపాటి రవికుమార్

అద్దంకి రూరల్: సాగర్ జలాలు కాలవలకు సరఫరా చేసే సమయంలో వృథాగా పోకుండా షట్టర్లు, లాకులతో పరిరక్షించుకోవాలని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ అధికారులకు సూచించారు. సోమవారం స్థానిక కామేపల్లి కల్యాణ మండపంలో సాగర్ నీటి సంఘాల చైర్మన్లు, అధ్యక్షులు, డైరెక్టర్‌లు, ఇరిగేషన్ అధికాలతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒకే సమయంలో కాకుండా జోన్‌ల వారీగా నీటిని విడుదల చేయాలని సూచించారు. కాలువలపై కష్టపడి పనిచేసే వారితోనే లస్కర్ పోస్టులు భర్తీ చేయాలని అధికారులకు తెలిపారు.

అధి'కారం' కోసం టక్కుటమారాలు

- ఎత్తుగడతో బీసీ మంత్రులకు సన్మానం
- కానుకగా మార్కెట్ యార్డు కార్యదర్శి పోస్టింగ్
- ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు ముందుచూపు
- నిబంధనలకు వ్యతిరేకంగా ఆదేశాలు
- గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శిగా చంద్రిక



గుంటూరు మార్కెట్ యార్డు ప్రవేశ ద్వారం

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్రంలోనే అత్యధిక ఆదాయం వచ్చే గుంటూరు మార్కెట్ యార్డుపై తెలుగుదేశం నేతల కన్ను పడింది. కార్యదర్శి పోస్టు కోసం పెద్దఎత్తున లాబీయింగ్ జరిగింది. విశాఖపట్నానికి చెందిన తెలుగుదేశం ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు కోడలు చంద్రికకు ఈ పదవి కట్టబెట్టారు. రెండు నెలల్లో పదవి ముగుస్తున్న రామారావు సోమవారం గుంటూరులో బీసీ మంత్రులకు సన్మానం చేశారు. అందులో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి సన్మానం చేయడం, అదే సమయంలో కోడలికి గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శిగా పోస్టింగ్ రావడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

లక్షల్లో ఆదాయం

మార్కెట్ యార్డులో జరిగే జీరో బిజినెస్, మచ్చు కాయల పేరుతో దోపిడీ, కోల్డ్‌స్టోరేజీలు, లైసెన్స్‌లు, యార్డు సెక్యూరిటీల జీతభత్యాలు ఇలా పలు రూపాల్లో మార్కెటింగ్ కార్యదర్శికి నెలకు లక్షల్లో ఆదాయం వస్తుంది. గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శిగా విశాఖపట్నం మున్సిపల్ కార్పొరేషన్(జీవీఎంసీ) డెప్యూటీ ప్రాజెక్టు అధికారిణిగా పనిచేస్తున్న ఎ.చంద్రికను ఏడాది పాటు డెప్యుటేషన్ మీద కొనసాగేలా నియమిస్తూ వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఎక్స్ ఆఫిసియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. మున్సిపల్ పరిపాలన శాఖ ఇప్పటికే అనుమతిచ్చింది. దీంతో మార్కెటింగ్, మున్సిపల్ శాఖల నుంచి ఆమెకు లైన్ క్లియర్ అయ్యింది.

హైకోర్టును ఆశ్రయించిన ప్రస్తుత కార్యదర్శి

మరోవైపు ప్రస్తుతం యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శిగా ఉన్న వినుకొండ ఆంజనేయులు ఇప్పటికే హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. వ్యవసాయ మార్కెట్ కమిటీ చట్టం –1969 రూల్ నెంబర్–158 ప్రకారం సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీగా మార్కెటింగ్ శాఖలోని ఆ స్థాయి అధికారి గానీ, లేకపోతే మార్కెటింగ్ శాఖ డెప్యూటీ డైరెక్టర్(డీడీఎం)ను గానీ నియమించాల్సి ఉందని, బయట వారిని నియమించేందుకు నిబంధనలు ఒప్పుకోవనే వాదనతో ఆంజనేయులు హైకోర్టును ఆశ్రయించినట్లు సమాచారం. దీనిపై మంగళవారం తీర్పు వెలువడనున్నట్లు సమాచారం. దీంతో మిర్చి యార్డు వ్యవహారం ఉత్కంఠగా మారింది.

భారీగా అవినీతి జరిగిందంటూ ప్రచారం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గుంటూరు మార్కెట్ (మిర్చి) యార్డులో భారీగా అవినీతి జరిగిందంటూ ప్రచారం చేశారు. దీనిపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో విచారణ జరిపించి ప్రభుత్వానికి నివేదిక పంపించారు. ఎవరైతే అవినీతి జరిగిందని విచారణ జరిపి నివేదిక ఇచ్చారో, అదే అధికారి భార్యను గుంటూరు తీసుకురావడం కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారు. మిర్చి యార్డు కార్యదర్శికి ఏఏ మార్గాల్లో ఆదాయం వస్తుందో విచారించారు. తర్వాత రాజకీయ నాయకుడైన తన తండ్రి సహకారంతో పోస్టింగ్ దక్కించుకున్నారు.

ఫిర్యాదులు త్వరగా పరిష్కరించాలి

- అదనపు ఎస్పీ సంతోష్
- జిల్లా పోలీసు గ్రీవెన్స్‌కు 43 ఫిర్యాదులు

నరసరావుపేట: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ ఎస్)కు వచ్చిన ఫిర్యాదులకు మొదటి ప్రాధాన్యమిచ్చి త్వరగా పరిష్కరించాలని జిల్లా అదనపు ఎస్పీ జేవీ సంతోష్ ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమానికి ఆయన అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన బాధితుల వద్ద 43 ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రతి ఫిర్యాదునూ గడువులోగా పరిష్కరించేందుకు కృషి చేయాలని సూచించారు.



జిల్లా పోలీసు కార్యాలయంలో అదనపు ఎస్పీ సంతోష్‌ను కలిసి తమ సమస్య చెప్పుకుంటున్న బాధితులు



జిల్లా పోలీసు గ్రీవెన్స్‌కు తరలివచ్చిన ప్రజలు

ఏటీఎం కార్డు కాజేసి రూ.57 వేలు డ్రా చేశాడు

గతేడాది జూలై 27న ఏటీఎం దగ్గరకు వెళ్లా. డబ్బులు తీయటం తెలియక పక్కనే ఉన్న వ్యక్తిని అడిగాను. సదరు వ్యక్తి రూ.10 వేలు తీసిచ్చాడు. నాకు తెలియకుండా కార్డును కాజేసి రూ.57వేలు విత్‌డ్రా చేశాడు. ఆ వ్యక్తిని గుర్తించి డబ్బులు అడగగా ఇవ్వకుండా ఇబ్బందులు పెడుతున్నాడు.

– సోము వెంకటేశ్వర్లు, మేళ్లవాగు, బొల్లాపల్లి మండలం

ఆస్తి జోలికొస్తే చంపుతా అంటున్నాడు

నా భర్త చనిపోయిన వెంటనే నా భర్త సోదరుడు నాకు దక్కాల్సిన ఇంటిని, పొలాన్ని ఆక్రమించుకున్నాడు. వెళ్లి అడగగా కొట్టి, తిట్టి ఆస్తి విషయానికి వస్తే చంపుతానని బెదిరిస్తున్నాడు. ఆయనపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

–దాసరి జ్యోతి, దొడ్లేరు, బెల్లంకొండ మండలం

వాట్సాప్‌లో అసభ్య సందేశాలు పెడుతున్నారు

నా నాలుగో కుమార్తె విజయలక్ష్మి అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తోంది. ఆమెకు, అల్లుడికి మనస్పర్థలు ఉన్నాయి. దీంతో మమ్మల్ని, నా కుమార్తెను అసభ్యంగా తిడుతూ కొందరు వాట్సాప్‌లలో సందేశాలు పెడుతూ మానసికంగా ఇబ్బందులకు గురి చేస్తున్నారు. నిందితులపై చర్యలు తీసుకోండి.

–రుద్రపాటి వెంకటకోటమ్మ, చాగంటివారిపాలెం, ముప్పాళ్ల మండలం

నా డబ్బులు ఇప్పించండి

అవసరానికి నరసరావుపేటకు చెందిన కె.కృష్ణ నా వద్ద నుంచి రూ.30 వేలు తీసుకున్నాడు. ఆ డబ్బుల విషయమై కృష్ణ ఇంటికి వెళ్లి అడుగగా కొట్టి చంపుతానని బెదిరిస్తున్నాడు. నాకు ప్రాణహాని ఉన్నందున చట్టపరంగా అతనిపై చర్యలు తీసుకొని నాకు డబ్బులు ఇప్పించండి.

--చుండూరు కృష్ణమూర్తి, చిలకలూరిపేట

డబ్బులు తిరిగి ఇచ్చినా వేధిస్తున్నాడు

గతంలో వి.వెంకటేశ్వరరెడ్డి వద్ద రూ.2లక్షలు అప్పుగా తీసుకొని తిరిగి ఇచ్చాను. సమయం అయిన ప్రామిసరీ నోటు తన వద్దనే పెట్టుకొని డబ్బులు ఇవ్వాలని ఇబ్బంది పెడుతున్నాడు. అతనిపై చర్యలు తీసుకొని నాకు న్యాయం చేయండి.

– మెట్టు కోటిరెడ్డి, చిరుమామిళ్ల, నాదెండ్ల మండలం

క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ కార్యకర్తకు పీఆర్కే ఆర్థికసాయం



పీఆర్కే పెద్ద మనసుతో చేసిన ఆర్థిక సాయాన్ని అందిస్తున్న ముస్లిం నాయకులు

మాచర్ల: పట్టణంలో 28వ వార్డుకు చెందిన ముస్లిం మైనార్టీ నాయకులు వెల్డింగ్ షంషీర్ బ్రెయిన్ స్ట్రోక్‌కు గురై తీవ్ర ఇబ్బంది పడుతున్న విషయాన్ని తెలుసుకున్న వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పిన్నెల్లి రామకృష్ణా రెడ్డి చలించిపోయారు. షంషీర్ ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. సోమవారం ముస్లిం నాయకులకు రూ. 50వేల ఇచ్చి వెంటనే షంషీర్‌కు అందించాలని ఆదేశించారు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మున్సిపల్ మాజీ చైర్మన్ అబ్దుల్ జలీల్, షేక్ సద్దార్, నాగూర్, షరీఫ్, కిజర్, గౌస్, మణి పీఆర్కే అందించిన నగదును షంషీర్ బంధువులకు అందించారు.

మా బంగారం ఇప్పించండి

చైతన్య గోదావరి బ్యాంకు ఎదుట బాధితుల వంటావార్పు



బ్యాంకు ఎదుట ఆందోళన చేస్తున్న బాధితులతో మాట్లాడుతున్న సీఐ సురేష్

దొడ్లేరు(క్రోసూరు): దొడ్లేరు గ్రామంలోని చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకులో రెండేళ్ల క్రితం జరిగిన బంగారం స్కామ్ కేసులో బాధితులు సోమవారం ఆందోళన చేశారు. బ్యాంకు ఎదుట వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. తమ బంగారం ఇప్పించాలని, న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 500 మంది ఖాతాదారుల్లో 320 మందికి మాత్రమే గతంలో బ్యాంకు నష్టపరిహారం చెల్లించిందని, ఇంకా 180 మంది గురించి పట్టించుకోలేదని ధ్వజమెత్తారు. దీనిపై గత ఏడాది సెప్టెంబర్‌లో బాధితులు ఆందోళన చేసినా ఫలితం లేదు. దీంతో సోమవారం బాధితులు బ్యాంకులోకి అధికారులను వెళ్లనివ్వకుండా అడ్డుకున్నారు. బ్యాంకు ఎదుట వంటావార్పు చేపట్టి నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న క్రోసూరు సీఐ పి.సురేష్ ఘటనా స్థలానికి వచ్చి బాధితులతో మాట్లాడారు. మార్చి ఆఖరులోపు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో బాధితులు ఆందోళన విరమించారు.

జగనన్న పాలనలో బీసీలకు సముచిత ప్రాధాన్యం



ముదిరాజ్ సంఘ నాయకులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి విడదల రజిని

మాజీ మంత్రి విడదల రజిని

చిలకలూరిపేట: వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బీసీలకు ఎంతో ప్రాధాన్యం కల్పించారని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని చెప్పారు. రాష్ట్ర ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొర్ణ వెంకటనారాయణ స్థానిక ముదిరాజ్ సంఘ నాయకులతో కలసి సోమవారం పట్టణంలో రజినిని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విడదల రజిని మాట్లాడుతూ ప్రతి బీసీ కులానికి ప్రత్యేక కార్పొరేషన్‌ను వైఎస్ జగన్ ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఈ నేపథ్యంలో బీసీలు వైఎస్సార్ సీపీకి అండగా నిలవాల్సిన ఆవశ్యకత ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర ముదిరాజ్ విభాగం అధ్యక్షుడు కోమటి విష్ణువర్ధన్ ముదిరాజ్, ముదిరాజ్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్లు, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు.

నేడు జాతీయస్థాయి ఎడ్ల బలప్రదర్శన ప్రారంభం

రెంటచింతల: ఫిబ్రవరి 2న నిర్వహించనున్న స్థానిక కానుకమాత చర్చి 175 వజ్రోత్సవ తిరుణాళ్లను పురస్కరించుకుని మంగళవారం నుంచి జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎద్దుల బలప్రదర్శన ప్రారంభం కానుందని కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. దీనికోసం సర్వం సిద్ధమైందని వివరించారు. స్థానిక సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడామైదానంలో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శనకు వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చే ఎద్దుల యజమానులకు, రైతు సోదరులకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు వెల్లడించారు. ప్రతి విభాగంలో 9 బహుమతుల చొప్పున 54 మంది విజేతలకు మొత్తం రూ. 16.30 లక్షల నగదును అందచేయనున్నట్లు వెల్లడించారు. 28న రెండు పళ్ల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.30 వేలు, రూ.25 వేలు, రూ. 20 వేలు, 29న నాలుగు పళ్ల విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 40 వేలు, రూ.30 వేలు, రూ. 25 వేలు, 30వ తేదిన ఆరు పళ్ల విభాగంలో ప్ర మ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 45 వేలు, రూ.35 వేలు, రూ. 30 వేలు, 31 వ తేదిన న్యూ క్యాటగిరి విభాగం లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ. 65 వేలు, రూ. 55 వేలు, రూ. 45 వేలు, ఫిబ్రవరి 1వ తేదిన జూనియర్స్ విభాగంలో రూ. 80 వేలు, రూ. 65 వేలు, రూ. 45 వేలు, ఫిబ్రవరి 3 వ తేదిన సీనియర్స్ విభాగంలో ప్రథమ, ద్వితీయ, తృతీయ, 4 వ, 5 వ బహుమతులుగా రూ. 1.25 లక్షలు, రూ. 1 లక్ష, రూ. 80 వేలు, రూ. 60 వేలు, రూ. 50 వేలు చొప్పున ఎడ్ల యజమానులకు అందజేస్తారని తెలిపారు.



జాతీయస్థాయి ఎద్దుల బలప్రదర్శనకు సిద్ధమైన సెయింట్ జోసఫ్స్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానం

వెలుగు వీఏవోల సమస్యలు పరిష్కరించాలి

నరసరావుపేట: వీఏవోల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు గుంటూరు విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఏపీ వెలుగు వీఏవో (యానిమేటర్ల)ల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు పట్టణంలోని గాంధీ పార్క్ వద్ద ధర్నా చౌక్‌లో రీలే నిరాహార దీక్షలను సోమవారం ప్రారంభించారు. ఈసందర్భంగా విజయ్‌కుమార్ మాట్లాడుతూ వీఏవోల సమస్యలపై సర్కారు నిర్లక్ష్య ధోరణి సరికాదన్నారు. సీఐటీయూ పల్నాడు జిల్లా అధ్యక్షులు కొత్తపల్లి హనుమంతరెడ్డి మాట్లాడుతూ వీఏవోలపై రాజకీయ కక్ష సాధింపు చర్యలు మానుకోవాలని పేర్కొన్నారు.

స్టేడియంలో జిల్లాస్థాయి బ్యాడ్మింటన్ టోర్నమెంట్



నరసరావుపేట రూరల్: జిల్లా నాన్ మెడలిస్ట్ ఓపెన్ ఇన్విటేషన్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్ సత్తెనపల్లి రోడ్డులోని స్టేడియంలో సోమవారం నిర్వహించారు. పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. రెండు విభాగాలలో పోటీలను నిర్వహించారు. పట్టణ విభాగంలో 25టీమ్‌లు, మెన్స్ డబుల్స్ విభాగంలో 15 టీమ్‌లు పాల్గొన్నాయి. హోరాహోరిగా పోటీలు సాగాయి. మెన్స్ డబుల్స్ విభాగంలో ప్రథమ బహుమతిని ధనూష్, కార్తీక్, ద్వితీయ బహుమతిని రవితేజ, ప్రణయ్, తృతీయ బహుమతిని లిబ్నీ, హుస్సెన్, నాలుగో బహుమతిని ఖాదర్, జాయ్‌కుమార్‌లు గెల్చుకున్నారు. విజేతలకు నగదు బహుమతితోపాటు షీల్డ్‌లు అందజేశారు. పోటీలను స్టేడియం షటిల్ కోర్ట్ నిర్వాహకుడు డి.పరమేష్, జిల్లా కాపు సంఘం అధ్యక్షుడు రామిశెట్టి రామకృష్ణలు పర్యవేక్షించారు.

ఉమ్మడి గుంటూరు జిల్లా ఖో-ఖో జట్ల ఎంపిక



మెన్స్ డబుల్స్‌లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులు

నకరికల్లు: ఉమ్మడి గుంటూరు జిల్లా ఖో-ఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో మహిళల, పురుషుల జిల్లా ఖో-ఖో జట్ల ఎంపిక పూర్తయింది. మహిళల, పురుషుల జిల్లా స్థాయి తుది జట్లను అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చింతా పుల్లయ్య ప్రకటించారు. ఎంపికైన క్రీడాకారులు ప్రకాశం జిల్లా జె.పంగలూరులో ఫిబ్రవరి 7,8,9 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్ పోటీలలో ఉమ్మడి గుంటూరు జిల్లా తరఫున తలపడనున్నారు. క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి జిల్లా ప్రథమస్థానంలో నిలిచేలా కృషి చేస్తామని ఫిజికల్ డైరెక్టర్, ఖో-ఖో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చింతా పుల్లయ్య తెలిపారు.

పురుషుల జట్టు

పి.రవి (గుడ్లవల్లేరు), బి.అశోక్(ముటుకూరు), జె.రాఘవేంద్ర(కారంపూడి), బి. సింహాద్రినాయక్ (ఈపూరు), షేక్.అల్లాబక్షు(కారంపూడి), పి.సైదారావు(విక్టరీ డిగ్రీ కళాశాల), బి.స్వామినాయక్ (ఈపూరు), జి.జీవన్ లక్ష్మీకుమార్(గుంటూరు), పి.గోపినాధ్(కృష్ణవేణి డిగ్రీ కళాశాల), ఎం.అవినాష్(విక్టరీ డిగ్రీ కళాశాల), పి.నాగరాజు(బుద్ధం గ్రామం), ఆర్.శ్రీనునాయక్(ఈపూరు), షేక్.అల్మాస్(నరసరావుపేట), షేక్.బషీర్ (గుంటూరు), కె.పవన్‌కుమార్ నాయక్(బాలాజీనగర్‌తండా)

మహిళల జట్టు

బి.అలేఖ్య(కృష్ణవేణి డిగ్రీ కళాశాల), పి.లక్ష్మీ తిరుపతమ్మ (విక్టరీ కాలేజ్), డి.రంగా మహాలక్ష్మి (జెడ్పీహెచ్‌ఎస్ ఎస్.బి.పురం), ఎం.శ్రీలక్ష్మి (ట్రిపుల్ ఐటీ), టి.ఎల్.పి.చంద్రిక (జడ్పీహెచ్‌ఎస్ ఎస్.బి.పురం), ఎం.శిరీష (కృష్ణవేణి డిగ్రీ కళాశాల), బి.సౌజన్య (జడ్పీహెచ్‌ఎస్ ఎస్.బి.పురం), డి.లక్ష్మీప్రసన్న (ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్, బాపట్ల), కె.బుజ్జి (ఏఎంఎస్ కాలేజ్), ఆర్.నాగశ్రీలక్ష్మీ (జడ్పీహెచ్‌ఎస్, ఒప్పిచర్ల), టి.ఉమా హరిత(జడ్పీహెచ్‌ఎస్, చెరుకుపల్లి), పి.శివమణి (జడ్పీహెచ్‌ఎస్, ఒప్పిచర్ల), ఎం.హేమలత(కృష్ణవేణి డిగ్రీ కళాశాల), ఎన్.వెంకటశివ (సెయింట్ మేరీస్ గుంటూరు), వి.చైతన్య బాయి(ట్రిపుల్ ఐటీ నూజివీడు)

పోలీసు బందోబస్తు మధ్య డ్రెయినేజీ పనులు పునఃప్రారంభం



జెండాచెట్టు వద్ద పనులు చేపట్టిన వివాదాస్పద ప్రాంతం

మాదల(ముప్పాళ్ళ): ముగ్గురు సీఐలు, ఐదుగురు ఎస్సైలు, 50 మంది అదనపు పోలీసు బలగాలు సోమవారం గ్రామానికి రావడంతో మాదల గ్రామస్తుల్లో అలజడి నెలకొంది. ఏం జరుగుతుందని తెలియక కొందరు తికమకపడ్డారు. తీరా చూస్తే పోలీసు బలగాలు డ్రెయినేజీ నిర్మాణ ప్రారంభానికి అని తెలిసి ఊపిరిపీల్చుకున్నారు. మాదలలో డ్రెయినేజీ నిర్మాణాన్ని అధికారులు చేపట్టారు. జెండా చెట్టు వద్ద పనులకు ముస్లిం వర్గీయులు అభ్యంతరం చెప్పారు. తమ దుకాణాల ముందు ఉన్న నిర్మాణాలను క్రేన్ సాయంతో తొలగిస్తుండగా పగుళ్లు వచ్చే అవకాశం ఉందని అడ్డుకున్నారు. దీంతో వారం క్రితం అధికారులు పనులు నిలిపివేశారు. మళ్లీ పనుల ప్రారంభానికి పోలీసు బలగాలను పిలిపించారు. దుకాణ సముదాయాల గోడ నుంచి మూడు అడుగులు ఖాళీ వదిలి పనులు చేసుకోవాలని ముస్లిం వర్గీయులు కోరారు. అలా చేస్తే రోడ్డు వెడల్పు పూర్తిగా తగ్గుతుందంటూ గ్రామస్తులు బదులివ్వడంతో ఇరువర్గాల మధ్య వాదనలు జరిగాయి. దీంతో సర్వేయర్‌ను పిలిపించి ఇరు వర్గాల సమక్షంలో కొలతలు తీశారు. ఎట్టకేలకు దుకాణ సముదాయాల గోడ నుంచి అడుగు వదిలి కాల్వ నిర్మించేలా ఇరువర్గాల మధ్య ఒప్పందం కుదిరింది. దీంతో వివాదం సద్దుమణిగింది. పనులు ప్రారంభం కావడంతో పోలీసు బలగాలు వెనుదిరిగారు. సీఐలు ఎం.వి.సుబ్బారావు(సత్తెనపల్లిరూరల్), వై.అచ్చయ్య(అమరావతి), వెంకటప్రసాదు(అచ్చంపేట)తో పాటుగా ముప్పాళ్ళ ఎస్సై వి.సోమేశ్వరరావు, డివిజన్ పరిధిలోని ఎస్సైలు బందోబస్తులో పాల్గొన్నారు.

షట్టర్లు అమర్చారు



సాక్షి ఎఫెక్ట్

పెదకూరపాడు: 'ఆరుతడికి కంటతడి' శీర్షికన ఈనెల 23న సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి ఇరిగేషన్ అధికారులు స్పందించారు. అమరావతి మేజర్‌పై సత్తెనపల్లి స్టేషన్ పరిధిలో మరమ్మతులకు గురైన షట్టర్లను బాగు చేసి అమర్చారు. పెదకూరపాడు సాగునీటి సంఘం చైర్మన్ వడ్లమూడి అప్పారావు అధికారులతో మాట్లాడి వెంటనే షట్టర్లు బిగించే ఏర్పాటు చేశారు.

ఖననం చేసిన మృతదేహానికి పోస్టుమార్టం

కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు తల్లి ఫిర్యాదుతో చర్యలు

నరసరావుపేటటౌన్: తన కుమారుడి మృతిపై అనుమానం ఉందని తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో మూడు నెలల క్రితం ఖననం చేసిన మృతదేహాన్ని సోమవారం వెలికితీసి పోస్టుమార్టం చేశారు. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. వెంకట్‌రెడ్డి నగర్‌కు చెందిన గుజ్జర్లపూడి మెస్సీ మనోహర్ ఉరఫ్ బెన్నీ(41) పంచాయితీ రాజ్ శాఖలో ఉద్యోగం చేసేవాడు. గత ఏడాది అక్టోబర్ 4న ఇంట్లో మృతి చెందాడు. సాధారణ మృతిగా భావించిన కుటుంబ సభ్యులు అతని మృతదేహాన్ని ఖననం చేశారు. అయితే తన కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నాయని, ఈ వ్యవహారంలో కోడలి పాత్ర ఉందంటూ మృతుడి తల్లి ప్రమీల పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో టూటౌన్ పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో అనారోగ్యంతో ప్రమీల ఇటీవల మృతి చెందింది. మృతుడి సోదరుడు శ్యామ్ సమక్షంలో తహసీల్దార్ వేణుగోపాల్, ఎస్‌ఐ అశోక్, గుంటూరు నుంచి వచ్చిన ఫోరెన్సిక్ వైద్యులు స్థానిక క్రైస్తవ సమాధుల తోట నుంచి మృతదేహాన్ని వెలికితీసి శవపంచనామా నిర్వహించారు.